అధికారితో..

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

తాడేపల్లిగూడెం పట్టణంలో మంచినీరు, డ్రెయిన్లు, పారిశుధ్యం, పార్కులు, విద్యుత్ దీపాలు వంటి సమస్యలపై 21 తేదీ శుక్రవారం ఉదయం 11-12 గంటల మధ్య 'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్' నిర్వహించనుంది. పట్టణ ప్రజలు

73868 43577

నెంబరుకు ఫోన్ చేసి తాడేపల్లిగూడెం మునిసిపల్ కమిషనర్ మాచగరి ఏసుబాబుకు సమస్యలను వివరిస్తే.. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు.

అధ్యక్షా..



ప్రభుత్వ కార్యకలాపాల్లో నూతన ఒరవడి

తణుకు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యకలాపాల్లో సాంకేతికతతో నూతన ఒరవడి సృష్టించారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందుబాటులోకి వచ్చిన మిత్ర యాప్‌తో 200 సేవలు అందుబాటులోకి వచ్చాయి. 51.09 లక్షల లావాదేవీల్లో 25.99 లక్షల మందికి సేవలందుకున్నారు. ఐటీ ద్వారా అప్పట్లోనే చంద్రబాబునాయుడు ప్రారంభించారు. మారుతున్న సాంకేతికను అనుగుణంగా మరింత ముందుకు తీసికెళ్లాలనే ఉద్దేశంతో ప్రభుత్వ సేవలను సమర్థంగా, పారదర్శకంగా అవినీతిరహితంగా అందించాలనే ఆలోచనతో ఎవరూ ఊహించని విధంగా మన మిత్ర యాప్‌తో శ్రీకారం చుట్టిన మంత్రి లోకేశ్ దార్శినికతకు అభినందనలు. ప్రధానంగా విద్యార్థులు హాల్ టికెట్ల ఈ యాప్ ద్వారానే డౌన్ లోడ్ చేసుకున్నారు' అని బుధవారం అసెంబ్లీలో తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడారు.



ఆహార కల్తీని నిరోధించాలి

తాడేపల్లిగూడెం రూరల్ : 'కల్తీలతో ప్రజల ప్రాణాల మీదకు వస్తుంది. కల్తీలను నిరోధించడానికి ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల సంఖ్యను పెంచాలి. ప్రజల ప్రాణాలను కాపాడడం మన ధర్మం. హోటళ్లలో చైనా నుంచి దిగుమతి చేసుకున్న టేస్టింగ్ సాల్ట్ వాడడం వల్ల ప్రజల కిడ్నీలు, లివర్లు పాడుతున్నాయి. ఇటు చేపల నుంచి పుచ్చకాయల వరకు కల్తీ జరుగుతోంది. దీనిపై దృష్టి సారించాలి. పశ్చిమ గోదావరి జిల్లాలో ఒకే ఒక ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఉండడమే దీనికి నిదర్శనం. దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉంది' అని అసెంబ్లీలో తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడారు.

హిందీ పరీక్షకు 377 మంది గైర్హాజరు

భీమవరం రూరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా బుధవారం జరిగిన పదో తరగతి హిందీ పరీక్షకు 21,622 మంది విద్యార్థులు హాజరు కాగా 377 మంది గైర్హాజరయ్యారు. పలు పరీక్ష కేంద్రాలను డీఈవో, జిల్లా స్థాయి పరిశీలకులు తనిఖీలు చేశారు. ఎటువంటి మాల్ ప్రాక్టీస్ జరగలేదని డీఈవో నారాయణ తెలిపారు. ఓపెన్ స్కూల్ ఆంగ్ల పరీక్షకు 370 మంది హాజరు కాగా 87 మంది గైర్హాజరయ్యారు.

గౌడ కార్పొరేషన్ డైరెక్టర్‌గా

'పామర్తి'కి చోటు

ఏలూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఏపీ గౌడ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా భీమవరానికి చెందిన పామర్తి వెంకట్రామయ్య నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు అందించారు.

యలమంచిలి, అత్తిలి ఎంపీపీలకు

27న ఉప ఎన్నిక

ఏలూరు సిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఖాళీగా ఉన్న రెండు ఎంపీపీ, రెండు వైస్ ఎంపీపీ పదవులకు, ఒక కో-ఆప్షన్ సభ్యునికి ఉప ఎన్నికల షెడ్యూలు విడుదలైంది. వీటిలో యలమంచిలి, అత్తిలి ఎంపీపీలకు, ఏలూరు రూరల్, అత్తిలి, కైకలూరు వైస్ ఎంపీపీ పదవులకు, పెరవలి కో-ఆప్షన్ సభ్యుడి పదవికి ఎన్నిక జరగనుంది. వీటికి సంబంధించి 27న ఉదయం పది గంటలలోగా నామినేషన్ల స్వీకరణ, మధ్యాహ్నం 12 గంటల్లోగా పరిశీలించి, అభ్యర్థులను ప్రకటిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు ఒంటి గంటలోగా గడువు విధించారు. ఆ తర్వాత ఎన్నికలు నిర్వహించి విజేతలను ప్రకటిస్తారు.

అభయాంజనేయ స్వామికి మంత్రి లోకేశ్ పూజలు



పెదపాడు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ కృష్ణా జిల్లా మల్లవల్లిలోని అశోక్ లేల్యాండ్ కంపెనీని ప్రారంభించడానికి వెళ్తూ మార్గమధ్యలో అప్పనవీడు అభయాంజనేయ స్వామిని బుధవారం దర్శించుకుని పూజలు చేశారు. ఆయనకు కృష్ణా, ఏలూరు జిల్లా కూటమి శ్రేణులతోపాటు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి ఘన స్వాగతం పలికారు. పూజల అనంతరం దేవాలయ అర్చకులు స్వామి వారి శేషవస్త్రాన్ని కప్పి తీర్థప్రసాదాలు అందజేశారు. ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, పెద్ద సంఖ్యలో టీడీపీ, జనసేన నాయకులు, టీడీపీ అభిమానులు పాల్గొన్నారు

మంత్రి లోకేశ్‌కు పూలబొకే అందిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని.. చిత్రంలో ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి



స్వామివారి సన్నిధిలో మంత్రి లోకేశ్ పూజలు

'మీ భూములకు రాష్ట్రంలో ఎక్కడా రిజిస్ట్రేషన్ కావడం లేదా ? అయితే మొగల్తూరు వచ్చేయండి. మేం చేయిస్తాం' అంటూ కొంత కాలంగా కొందరు అక్రమ రిజిస్ట్రేషన్లకు తెగబడుతున్నారు. ఇందుకు నిదర్శనం.. కొన్నేళ్లుగా ఉమ్మడి తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల నుంచి అధిక సంఖ్యలో రిజిస్ట్రేషన్లు ఇక్కడి కార్యాలయంలో జరగడమే ! అక్రమ రిజిస్ట్రేషన్లకు ఇక్కడి సబ్ రిజిస్ట్రారు సహకరించడంతో ఇప్పుడు భూములకు భద్రత కరువైంది.



మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

భూం..ఫట్

అక్రమాలకు అడ్డా.. మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

- నిబంధనలకు విరుద్ధంగా భూముల రిజిస్ట్రేషన్లు
- ఎటువంటి వివాదాస్పద భూమికైనా ఇక్కడ గ్రీన్‌సిగ్నల్
- నేతల అండదండలతో సీఆర్‌జడ్ భూములనూ వదల్లేదు
- ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల నుంచి ఇక్కడకు క్యూ
- ఇప్పటికి ముగ్గురు సబ్ రిజిస్ట్రార్లు సస్పెన్షన్.. అయినా మారని తీరు
- నిషేధిత, ప్రభుత్వ పోరంబోకు స్థలాలకు రిజిస్ట్రేషన్లు చేసేశారని లేఖర్ల సంఘం ఆరోపణ
- మూడు వేల రిజిస్ట్రేషన్లపై సీబీసీఐడీ విచారణ చేపట్టాలని డిమాండ్

(భీమవరం-ఆంధ్రజ్యోతి): మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అక్రమాలకు అడ్డాగా మారింది. అక్కడ పనిచేసే అధికారులపై తరచూ వేటు పడుతోంది. తీర ప్రాంతంలో అసైన్డ్ భూములు అధికంగా ఉండడంతో అక్రమ రిజిస్ట్రేషన్‌లు జరుగుతున్నాయి. ఒకరి భూమిని మరొకరి పేరిట రిజిస్ట్రేషన్ చేసేస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడ రిజిస్ట్రేషన్ జరగపోయినా సరే మొగల్తూరు వచ్చేస్తున్నారు. రిజిస్ట్రేషన్లలో ఆన్‌లైన్ విధానం అమలు ఉండడంతో అంతా ఈ కార్యాలయంపైనే ఆధారపడుతున్నారు. ఇక్కడకు వస్తే రిజిస్ట్రేషన్‌లు సులువుగా అవుతాయని అంతా భావిస్తుండడమే ఇందుకు ప్రధాన కారణం. ఇది నిజం కూడా.! ఈ అక్రమాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళుతున్నాయి. ఈ క్రమంలోనే ముగ్గురు సబ్ రిజిస్ట్రార్‌లు వరుసగా సస్పెండయ్యారు. గత ప్రభుత్వంలోనే మొగల్తూరులో వందలాది రిజిస్ట్రేషన్‌లు అక్రమంగా జరిగాయి. అందుకు తగ్గట్టుగానే విచారణలో నిజమని తేలింది. సంబంధిత సబ్ రిజిస్ట్రార్‌లను సస్పెండ్ చేస్తూ వస్తున్నారు. అయినా అక్కడ అక్రమాలను అరికట్టలేకపోతున్నారు.

మూడు జిల్లాల రిజిస్ట్రేషన్లు ఇక్కడే

- మొగల్తూరు మండలం తూర్పు, పశ్చిమ, కృష్ణా జిల్లాలకు అనువుగా ఉంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారిపై పెద్దగా దృష్టి ఉండదు. దీంతో నిబంధనలు అడ్డొచ్చే రిజిస్ట్రేషన్‌లకు ఇది అడ్డాగా మారింది. వైసీపీ హయాంలో లెక్కలేనన్ని భూములను అడ్డంగా రిజిస్ట్రేషన్ చేశారు. నిషేధిత జాబితాలోని భూములను రిజిస్ట్రేషన్ చేసేశారు. మండలంలో ఈనామ్ భూములు, భూమి లేని నిరుపేదలకు ఇచ్చే స్థలాలు, పోరంబోకు, సీఆర్‌జడ్, గ్రామ కంఠంలో భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి సబ్ రిజిస్ట్రార్‌లను ప్రసన్నం చేసుకుంటున్నారు.
- ఇటీవల కృష్ణా జిల్లాలోని ప్రైవేటు భూములు వేరొకరి పేరుతో రిజిస్ట్రేషన్ చేశారంటూ మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద అలజడి రేగింది. బాధితులు కార్యాలయం వద్ద ధర్నాలకు దిగారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసనలు వ్యక్తం చేయడం ఇటీవల కాలంలో సర్వసాధారణమైంది. రిజిస్ట్రేషన్‌లకు అవకాశం లేని భూములు మండలంలో దాదాపు ఆరు వేలు ఎకరాలు ఉంటాయి. సదరు భూములను నిబంధనలను పక్కనపెట్టి రిజిస్ట్రేషన్‌లు చేయడం పరిపాటిగా మారింది. సీఆర్‌జడ్ భూములు రిజిస్ట్రేషన్‌లు అయిపోతున్నాయి. గతంలో సబ్ రిజిస్ట్రార్ ఏకంగా 300 రిజిస్ట్రేషన్‌లను చేసేశారు. దీనిపై అధికారులు దర్యాప్తు జరిపి నిజమని తేలడంతో సస్పెండ్ చేశారు. గత ప్రభుత్వంలోనే ఇవన్నీ జరిగిగాయి. అప్పటి అధికార పార్టీ నేతల ఒత్తిడితో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. కృష్ణా, తూర్పుగోదావరి జిల్లాల నుంచి కొనుగోలుదారులు ఇక్కడకే వస్తుంటారు. ఆన్‌లైన్ విధానాన్ని వినియోగించుకుంటున్నారు. గతంలో తాడేపల్లిగూడెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అందరి దృష్టి ఉండేది. మూడేళ్లుగా ఈ కార్యాలయంలో ఎటువంటి సమస్యలు లేవు. ఇప్పుడు ఆ జాబితాలో మొగల్తూరు కార్యాలయం చేరింది. ఇప్పటి దాకా మూడు వేల రిజిస్ట్రేషన్‌లు అక్రమంగా జరిగాయని అక్కడి లేఖరులే ఆరోపణలు చేశారంటే అవినీతి భాగోతం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.



మాట్లాడుతున్న దస్తావేజు లేఖర్ల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు

సీబీసీఐడీతో విచారణ చేయాలి

మొగల్తూరు : మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన రిజిస్ట్రేషన్లపై సీబీసీఐడీతో విచారణ చేయించాలని మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధి దస్తావేజు లేఖర్ల సంఘం అధ్యక్షుడు కొల్లాటి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం మొగల్తూరులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిషేధిత భూములు, ప్రభుత్వ పోరంబోకు స్థలాలు, ప్రభుత్వ ఇంటి స్థలాలు, మార్ట్‌గేజ్‌లు సుమారు మూడు వేల వరకు అక్రమ పద్ధతిలో మొగల్తూరు కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు జరిగి ఉండవచ్చని వాటిపై సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్పందించి సీబీసీఐడీతో విచారణ నిర్వహిస్తే జరిగిన అవకతవకలకు పాల్పడిన అధికారులపై చర్యలకు దళారీ పాత్ర పోషించిన కొంత మంది లేఖర్లపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేఖర్ల సంఘ కార్యదర్శి శీలబోయిన సత్యనారాయణ, సభ్యుడు కడలి త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరు వెళ్లాలంటే భయం

సబ్ రిజిస్ట్రార్‌లుగా మొగల్తూరు వెళ్లాలంటే ఇప్పుడు అంతా ఆందోళన చెందుతున్నారు. తాజాగా సస్పెండ్‌కు గురైన సబ్ రిజిస్ట్రార్ డిప్యూటేషన్‌పై ఆదాయపు పన్ను శాఖకు వెళ్లిపోయారు. కొత్తగా సబ్ రిజిస్ట్రార్‌లు ఎవరూ రావడం లేదు. సీనియర్ అసిస్టెంట్లతో కాలం వెళ్లదీస్తున్నారు. మొగల్తూరు వెళితే బలికాక తప్పదంటూ రిజిస్ట్రేషన్ శాఖలో బలమైన ముద్రపడింది. ఏదో ఒక రూపంలో అధికారులను బ్లాక్ మెయిల్ చేసి రిజిస్ట్రేషన్‌లు చేసుకునే పరిస్థితులు ఉన్నాయి. నేతల అండదండలు ఉన్నాయనే ఉద్దేశంతోనే అడ్డగోలుగా రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నారు. నాలుగేళ్ల వ్యవధిలో వరుసగా ముగ్గురు సబ్ రిజిస్ట్రార్‌లు సస్పెండ్ కావడంతో అక్కడ అవినీతి దందా ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది.



ఉచిత తొలి సిలిండర్‌కు గడువు 12 రోజులే..

- ఇంకా సిలిండర్లు పొందని వారు 92 వేల మంది

భీమవరంటౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తామని ఇచ్చిన హామీ మేరకు 2024-25 సంవత్సరానికి సంబంధించి దీపావళి కానుకగా ఇచ్చిన మొదటి గ్యాస్ సిలిండర్ పొందేందుకు ఇక గడువు 12 రోజులే ఉంది. మొదట్లో చాలామంది ఉత్సాహంగా గ్యాస్ బుక్ చేసుకుంటే కొంతమందికి ఈ పథకంలో బుక్ కాకపోవడంతో అసంతృప్తిగా ఉన్నారు. ఉచిత గ్యాస్ పొందేందుకు అర్హతకు ఇచ్చిన గైడ్‌లైన్స్ ప్రకారం రాకపోవడంతో చాలామంది పెదవి విరుస్తున్నారు. గ్యాస్ ఏజన్సీల వద్దకు వెళ్లినా సంతృప్తికరమైన సమాచారం రావడం లేదని వాపోతున్నారు. వాస్తవంగా జిల్లాలో గ్యాస్ కనెక్షన్లు 6 లక్షల 27వేల మంది ఉన్నారు. వారిలో 5 లక్షల 28 వేల మంది అర్హులు ఉండగా ఇప్పటివరకు 4 లక్షల 36 వేల మంది ఉచిత గ్యాస్ సిలిండర్లు పొందారని అధికారికంగా లెక్కలు చెబుతున్నాయి. వీటిలో సబ్సిడీ బ్యాంక్‌లో నమోదైన వారు 4 లక్షల 32 మందికి జమ అయిందని, జిల్లాలో 98 శాతం పూర్తయినట్టుగా పౌర సరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. ఇంకా దాదాపు నాలుగు వేల మందికి సబ్సిడీ సొమ్ము పడాల్సి ఉందని అధికారుల లెక్కలప్రకారం కనిపిస్తోంది. ఇంకా 92 వేల మందికి సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు అందలేదు.

సబ్సిడీ గ్యాస్ అందకపోవడానికి కారణాలు ఇవే..

గ్యాస్ కార్డుదారుడు ఈకేవైసీ చేయించపోవడం, రేషన్ కార్డు ఒకరి పేరు, గ్యాస్ కార్డు మరొకరి పేరున ఉండడం, ఒకే డోర్ నెంబరుపై రెండు కనెక్షన్లు ఉండడం తదితర కారణాల వల్ల కొంతమందికి ఉచిత గ్యాస్ అందని పరిస్థితి. దీనిపై ప్రభుత్వం తర్జనభర్జన పడి కొత్త విధానాలను తీసుకువచ్చింది. దీనిని ఇటీవల జిల్లా అధికారులు జిల్లాలో ఉన్న గ్యాస్ డీలర్స్‌కు ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు సూచలను చేశారు.

చేయాల్సినవి ఇలా..

గ్యాస్ కార్డుదారుడు చనిపోతే వెంటనే కుటుంబంలోని లీగల్ హయ్యర్ పొందిన వ్యక్తిపేరుపై గ్యాస్ కార్డు మార్చడం. రేషన్ కార్డు ఒకరి పేరు, గ్యాస్ కార్డు మరొకరి పేరుపై ఉంటే సంబంధిత వ్యక్తులనుంచి అఫిడవిట్ తీసుకుని రేషన్ కార్డుదారుడి పేరున గ్యాస్ కనెక్షన్ మార్చేలా ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా ఒకే డోర్ నంబర్‌పై, ఒకే ఇంటిలో ఆధార్ కార్డులు ఆధారంగా రెండు గ్యాస్ కనెక్షన్‌లు ఉంటే వారిలో ఒకరికి మాత్రమే ఉచిత గ్యాస్ అందుతుంది. దీనిపై సంబంధిత గ్యాస్ ఏజన్సీలను సంప్రదిస్తే అర్హుల వివరాలు తెలియజేస్తారు. గ్యాస్ రానివారు ఏజన్సీలను సంప్రందించి మార్పులను రానున్న 12 రోజులల్లో చేయించుకుంటే ఉచిత గ్యాస్ సిలిండర్ పొందే అవకాశం ఉంది. లేకపోతే ఒక ఏడాదికి ఇచ్చిన మొదటి ఉచిత గ్యాస్ సిలిండర్ అందని దాక్షగానే ఉంటుంది.

ఏప్రిల్ నుంచి వచ్చే మార్చి వరకు మూడు సిలిండర్లు

ఏప్రిల్ నుంచి 2025-26 సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం ప్రకటించిన మూడు ఉచిత గ్యాస్ కనెక్షన్లు పొందేందుకు అవకాశం ఉంది. నాలుగు నెలలకు ఒక గ్యాస్ సిలిండర్ ఉచితంగా పొందవచ్చని అధికారులు చెబుతున్నారు.

శక్తి యాప్ ఒక రక్షణ కవచం

- శక్తి టీమ్ వాహనాలను ప్రారంభించిన ఎస్పీ నయీం అస్మి

భీమవరం క్రైం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మహిళల భద్రతే ప్రథమ ప్రాధాన్యతగా రాష్ట ప్రభుత్వం భరోసాగా ఉందని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. బుధవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఐదు శక్తి బృందాలను 30 మందితో జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్‌గుప్త ఉత్తర్వుల మేరకు మహిళలపై జరిగే నేరాలను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా 30 మంది సభ్యులతో ఐదు శక్తి బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఇటీవల కాలంలో మహిళలపై దాడులు పెరిగాయని, వాటిని అరికట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ టీమ్స్ జిల్లాలోని కళాశాలలు, పార్కులు, ఆర్టీసీ బస్టాండ్‌లు, ముఖ్య కూడళ్లలో మఫ్టీలో నిఘా ఉంటుందన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన ఐదు బృందాలు ప్రధాన కార్యాలయంలో రెండు, భీమవరం ఒకటి, నరసాపురం ఒకటి, తాడేపల్లిగూడెంలో ఒకటి, సబ్ డివిజన్లలో విధులు నిర్వహిస్తాయని, ఈ టీమ్స్‌లో ఎస్ఐ నేతృత్వంలో మొత్తం ఆరుగురు సభ్యులు ఉంటారన్నారు. ఈ బృందాలు ఆపద సమయంలో శక్తి యాప్‌నకు వచ్చే ఎస్ఓఎస్ కాల్స్, డయల్ 112/100 కాల్స్‌తో ఘటనా స్థలానికి సకాలంలో చేరుకుని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నామన్నారు.

యాప్ ప్రత్యేకతలు

- మహిళలు ఆపదలో ఉన్నప్పుడు శక్తి యాప్‌లోని సేవ్ అవర్ సోల్స్ (ఎస్ఓఎస్) ఆప్షన్ నొక్కితే వారు ఉన్న లోకేషన్ వీడియో, ఆడియో కంట్రోల్ రూమ్‌కు చేరుతుంది. ఫోన్ ఊపినా సమాచారం పోలీసులకు చేరుతుంది.
- ఒంటరిగా ప్రయాణిస్తున్న మహిళలు ఎస్ఓఎస్ ద్వారా వాహన నంబర్, ప్రయాణ మార్గాన్ని షేర్ చేయొచ్చు. పోలీసు కంట్రోల్ రూమ్ వాహనాన్ని ట్రాప్ చేస్తుంది.
- లైంగిక వేధింపులు, కలహాలు, గృహహింస, సైబర్ క్రైమ్స్, ఫొటో మార్ఫింగ్, పరువు హత్యలు, ఏ నేరాల గురించైనా ఆప్షన్‌తో ఫిర్యాదు చేయొచ్చు.
- భర్త వేధిపులు, గృహహింస, కుటుంబ కలహాలు వంటి సమస్యలకు ఫ్యామిలీ కౌన్సెలింగ్ సేవలు పొందొచ్చు.
- అప్రమత్తత కోసం కుటుంబ సభ్యులు లేక స్నేహితుల ఐదు ఫోన్ నంబర్లు ఈ యాప్‌లో నమోదు చేసుకోవచ్చు. ఆపద సమయంలో ఎస్ఓఎస్ నొక్కితే వారికి సమాచారం చేరుతుంది.
- బహిరంగంగా మద్యపానం, మాదకద్రవ్యాలు వినియోగం, అసాంఘిక కార్యకలాపాలు, ఈవ్ టీజింగ్ వంటి అంశాలపై ఫిర్యాదు చేయొచ్చు.



మహిళా శక్తి యాప్‌ను ఫోన్‌లో చూపిస్తున్న జిల్లా ఎస్పీ నయీం అస్మి

భరత్‌రెడ్డి ఎక్కడ ?

గత నెల 27న అరెస్టైన మద్యం కేసులో నిందితులకు బెయిల్

నరసాపురం, మార్చి 19(ఆంధ్రజ్యోతి) : నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యం కేసులో పరారీలో ఉన్న భరత్‌రెడ్డి ఇంకా చిక్కలేదు. పట్టుకునేందుకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. ఆంధ్రతో పాటు తెలంగాణలో అతడి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్టు నరసాపురం ఎక్సైజ్ సీఐ రాంబాబు తెలిపారు. ఈ కేసులో గత నెల 27న అరెస్టయిన బర్రె జయరాజుతోపాటు మరో ముగ్గురికి బుధవారం నరసాపురం కోర్టు బెయిల్ మంజూరుచేసింది. గతనెల 26న కొప్పర్రులోని చేపల చెరువులో ఎక్సైజ్ పోలీసులు జరిపిన మెరుపుదాడిలో 84 మద్యం కేసులు పట్టుబడ్డాయి. క్వార్టర్ బాటిళ్లపై గోవా లేబుల్ ఉండడంతో ఈ మద్యం ఆ రాష్ట్రం నుంచి దిగుమతి అయిందని మొదట ఎక్సైజ్ పోలీసులు భావించారు. ప్రాథమిక విచారణలో యానాం లింకులు బయటపడ్డాయి. ఆ ప్రాంతానికి చెందిన అతడు వీటిని సరఫరా చేశాడని ఎక్సైజ్ పోలీసుల విచారణలో బయటపడింది. చెరువుగట్టున పట్టుబడిన జయరాజుతో పాటు మరో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. అప్పటి నుంచి వీరు రిమాండ్‌లో ఉన్నారు. ఈ కేసులో ప్రధాన సూత్రదారి భరత్‌రెడ్డి చిక్కకపోవడంతో ఎక్సైజ్ పోలీసులు యానాం, ఆంధ్రలోని పలు ప్రాంతాల్లో గాలిస్తున్నారు. ఆచూకీ లేకపోవడంతో డైరెక్టర్ ఆఫ్ ఎక్సైజ్ పోలీసులకు అతడిని పట్టుకునేందుకు బాధ్యతలు అప్పగించారు.







చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

నాన్నకు ప్రేమతో..


'దక్ష' లో మోహన్‌బాబు



ప్రస్తుతం మంచు కుటుంబంలో యుద్ధవాతావరణం నెలకొని ఉంది. ముఖ్యంగా తండ్రీకొడుకులు మోహన్‌బాబు, మనోజ్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమని మండే పరిస్థితి. ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకున్నారు. తను సంపాదించిన ఆస్తులు, కట్టుకున్న ఇల్లు మనోజ్ ఆక్రమించాడని మోహన్‌బాబు స్వయంగా రంగారెడ్డి కలెక్టర్ ఆఫీసుకు వెళ్లి ఫిర్యాదు చేశారు. పోలీసుల సాయంతో మనోజ్‌ను హైదరాబాద్ జల్‌పల్లిలో ఉన్న తన ఇంటి నుంచి వెళ్లగొట్టారు మోహన్‌బాబు. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో మోహన్‌బాబు పుట్టిన రోజు వేడుకలు బుధవారం జరిగాయి. తండ్రి పుట్టినరోజు సందర్భంగా మనోజ్ సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టారు. 'హ్యాపీ బర్త్‌డే నాన్నా.. మనమంతా కలసి వేడుకలు చేసుకునే ఈ రోజు మీ పక్కనే ఉండే అవకాశాన్ని కోల్పోయా. మీతో కలసి ఉండే క్షణాల కోసం ఎదురు చూస్తున్నా.. లవ్ యూ' అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. మనోజ్ పెట్టిన ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మరి దీనిపై మోహన్‌బాబు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

విశ్వామిత్రకు పుట్టినరోజు శుభాకాంక్షలు

తన తండ్రి మోహన్‌బాబు పుట్టినరోజు సందర్భంగా నటి మంచు లక్ష్మీప్రసన్న ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ముఖ్య పాత్రధారిగా తను నిర్మిస్తున్న 'దక్ష' చిత్రంలోని లుక్‌ను షేర్ చేసి "మా ప్రొఫెసర్, డాక్టర్. విశ్వామిత్రకు పుట్టినరోజు శుభాకాంక్షలు" అని పేర్కొన్నారు. 'కన్నప్ప' సినిమాలో మోహన్‌బాబు మహదేవ శాస్త్రిగా కనిపించనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలోని 'ఓం నమః శివాయ' అనే పాటలో ఆయన పాత్రకు సంబంధించిన వీడియో గ్లింప్స్‌ను విడుదల చేసి శుభాకాంక్షలు తెలిపారు మేకర్స్

కడుపుబ్బా నవ్వించే చిత్రం


సప్తగిరి

సప్తగిరి కథానాయకుడిగా నటించిన చిత్రం 'పెళ్లికాని ప్రసాద్'. అభిలాష్‌రెడ్డి గోపిడి దర్శకత్వంలో కె.వై.బాబు, భానుప్రకాష్ గౌడ్, సుక్కా వెంకటేశ్వర్ గౌడ్, వైభవ్‌రెడ్డి ముత్యాల నిర్మించారు. దిల్‌రాజు నిర్మాణ సంస్థ శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ సినిమాను విడుదల చేస్తోంది. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు సప్తగిరి. "దర్శకుడు అభిలాష్ ఈ కథ చెప్పేటప్పుడే సినిమా విజయంపై పూర్తి నమ్మకం వచ్చేసింది. అందరినీ కడుపుబ్బా నవ్వించే చిత్రమిది. ఎక్కడా బోర్ కొట్టదు. దర్శకుడు అభిలాష్ రాసిన సంభాషణలు, వినోదాత్మక సన్నివేశాలు, శేఖర్ చంద్ర అందించిన సంగీతం ఈ సినిమాకు ప్రధానాకర్షణ. సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది" అని చెప్పారు.

అద్భుతమైన అనుభూతినిచ్చేలా...



హర్ష రోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు, నిహాల్ కోదాటి, సాన్వీ మేఘన ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'టుక్ టుక్'. సుప్రీత్ కృష్ణ దర్శకత్వంలో రాహుల్ రెడ్డి, లోక్కు శ్రీ వరుణ్, శ్రీరాముల రెడ్డి నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోన్న సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. కార్యక్రమంలో దర్శకుడు సుప్రీత్ మాట్లాడుతూ "ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతినిచ్చేలా సరికొత్తగా ఉంటుందీ సినిమా. అందరి మనసులు గెలుచుకుంటుంది" అని అన్నారు. "సినిమా తప్పక విజయం సాధిస్తుంది" అని నిర్మాత రాహుల్ రెడ్డి చెప్పారు.

బ్యాక్ టు హైదరాబాద్



మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న భారీ చిత్రం రెండో షెడ్యూల్ పూర్తయింది. ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని డాక్టర్ కె.ఎల్.నారాయణ నిర్మిస్తున్నారు. పదిహేను రోజులుగా ఒడిశాలోని కోరాపుట్ జిల్లాలో ఈ సినిమా షూటింగ్ జరిగింది. సిమిలిగుడ సమీపంలోని మాలి, పుట్‌సేల్, బాల్డ ప్రాంతాల్లో కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. మంగళవారం రాత్రితో షెడ్యూల్ పూర్తి కావడంతో చిత్ర యూనిట్ హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమైంది. యాక్షన్ అడ్వెంచర్ కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు రాజమౌళి.

అందమైన ప్రేమకథ



వినయ్‌కుమార్, శ్రావణి మజ్జరి, అరవింద్ ముదిగొండ, నేమిన తార ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కాలమేగా కరిగింది'. సింగార మోహన్ దర్శకత్వంలో మరే శివశంకర్ నిర్మించారు. ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా ఈ శుక్రవారం విడుదలవుతోందీ చిత్రం. తాజాగా, నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో హీరో వినయ్‌కుమార్ మాట్లాడుతూ "కలహాలే లేని అందమైన ప్రేమకథ ఇది" అని అన్నారు. "ఈ కవితాత్మక చిత్రం అందరినీ ఆకట్టుకుంటుంది. మంచి విజయం సాధిస్తుంది" అని దర్శకుడు శింగార మోహన్ చెప్పారు. "ఇదో స్వచ్ఛమైన ప్రేమకథ. సినిమా అద్భుతంగా ఉంటుంది" అని నిర్మాత మరే శివశంకర్ తెలిపారు.

మహిళల సమస్యలపై..



షెరాజ్ మెహదీ కథానాయకుడిగా స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఓ అందాల రాక్షసి'. విహాన్షీ హెగ్డే, కృతి వర్మ కథానాయికలు. సురీందర్ కౌర్ నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోన్న సందర్భంగా చిత్రబృందం ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. హీరో షెరాజ్ మెహదీ మాట్లాడుతూ "ఇది చిన్న చిత్రమైనా.. పెద్ద విజయం సాధిస్తుంది. అన్ని వర్గాల ప్రేక్షకుల ఆదరణ పొందుతుంది" అని చెప్పారు. హీరోయిన్ కృతి వర్మ మాట్లాడుతూ "ఈ సినిమా కథ వినగానే గూస్‌బంప్స్ వచ్చాయి" అని చెప్పారు. హీరోయిన్ విహాన్షీ హెగ్డే మాట్లాడుతూ "మహిళల సమస్యలపై తీసిన చిత్రమిది" అని తెలిపారు.





గేట్స్ ఫౌండేషన్ ఒప్పందాలతో రాష్ట్ర పురోగతి

కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

భీమవరం రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గేట్స్ ఫౌండేషన్‌తో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న కీలక ఒప్పందాలు రాష్ట్ర పురోగతికి ఎంతగానో దోహదపడతాయని కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ అన్నారు. ఢిల్లీలో బుధవారం మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్‌తో ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడుతో జరిగిన సమావేశంలో శ్రీనివాసవర్మ పాల్గొన్నారు. బిల్‌గేట్స్ ఫౌండేషన్, రాష్ట్ర ప్రభుత్వం మధ్య ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, ఉద్యోగ ఉపాధి కల్పన తదితర కీలక రంగాల్లో సేవలను మెరుగుపర్చడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ప్రెడిక్టివ్ ఎనలిటిక్స్ వంటి ఆధునిక సాంకేతికతల వినియోగానికి ఉన్న అవకాశాలపై చర్చలు జరిగాయని వర్మ తెలిపారు.


మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్‌కు జ్ఞాపిక అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

విదేశీ దిగుమతులు తగ్గిస్తాం : ఎంపీ మహేశ్



ఏలూరు టూటౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): విదేశీ ఉత్పత్తుల దిగుమతులు తగ్గించడానికి కేంద్రం చర్యలు తీసుకుంటుందని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ అన్నారు. లోక్‌సభలో ఎంపీ మహేశ్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి జితిన్ ప్రసాద్ సమాధానం ఇచ్చినట్లు తెలిపారు. దేశంలో ఎలక్ట్రానిక్స్, ఔషధాలు, టెలికాం, పవర్ వంటి వేగంగా విస్తరిస్తున్న రంగాల అవసరాలు తీర్చడానికి కేంద్రం దిగుమతులపై ఆధార పడిందని మంత్రి సమాధానం ఇచ్చారు. దిగుమ తులు తగ్గించుకోడానికి దేశీయ ఉత్పత్తులను పెంచేందుకు మేకిన్ ఇండియా కార్యక్రమంలో కేంద్రం అనేక చర్యలు చేపట్టిందన్నారు. చైనా ఉత్పత్తుల దిగుమతిని ఐదేళ్లలో తగ్గించేందుకు చర్యలు చేపడు తున్నామని మంత్రి సమాధానం ఇచ్చారు. సెమీ కండక్టర్స్, డిస్‌ప్లే తయారీ ఎకో సిస్టమ్ అభివృద్ధి రూ.76 వేల కోట్లతో సెమికాన్ ఇండియా ప్రోగ్రాం ఆమోదించిందని మంత్రి బదులిచ్చారు. రాష్ట్రంలో 99.58 శాతం ప్రజలకు మొబైల్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు.

రోడ్లు వేశాం.. రోడ్డు పాలయ్యాం

బిల్లులు చెల్లించాలని రోడ్లు ఊడ్చి నిరసన చేపట్టిన కాంట్రాక్టర్లు



ఏలూరు రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టర్లు రోడ్డెక్కారు. రహదారుల నిర్మాణ కాంట్రాక్టర్లు పెండింగ్ బిల్లులు చెల్లించాలని వినూత్న నిరసన చేపట్టారు. కలెక్టరేట్ వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల కాంట్రాక్టర్లు రోడ్లు ఊడ్చి నిరసన తెలిపారు. ఆర్‌అండ్‌బి కార్యాలయం వద్ద నుంచి ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ వి.సతీష్‌చౌదరి, సభ్యులు కేవీ.ప్రభాకర్, వైస్ చైర్మన్ వి.సోమేశ్వరరావు, కార్యదర్శి యూవీ.సత్యనారాయణ మాట్లాడారు. రాష్ట్రంలో వేలాది మంది కాంట్రాక్టర్లు 20పైగా ఇంజనీరింగ్ విభాగాల్లో వివిధ నిర్మాణ పనులు చేపట్టారన్నారు. ఇటీవల స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ఎన్విరాన్‌మెంట్ ప్రత్యేక డ్రైవ్‌లో పనులు చేపట్టామని తెలిపారు. వైసీపీ పాలనలో చేసిన పనులకు బిల్లులు రాక అనేక అవస్థలు పడ్డామని, చెల్లించాల్సిన బిల్లులు జాప్యం కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నామ న్నారు. కూటమి ప్రభుత్వంలో కూడా కొత్తగా రోడ్లు వేశామని, బిల్లులు రాక రోడ్డున పడ్డామంటూ కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో బిల్లులు చెల్లించేందుకు సీఎఫ్ఎంఎస్ నిధి పోర్టల్‌లోని సాంకేతిక అడ్డంకులను పరిష్కరించాలని, ఆర్‌అండ్‌బీ శాఖలో పెండింగ్‌లో ఉన్న సుమారు 1350 కోట్లు చెల్లించాలని, పంచాయతీరాజ్ విభాగంలో పెండింగ్ బిల్లులు తక్షణం క్లియర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి జిల్లాల మునిసిపల్ కాంట్రాక్టర్స్, బీఏఐ, ఏబీసీఏ అసోసియేషన్ నాయకులు, కాంట్రాక్టర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం డీఆర్వోను కలిసి వినతిపత్రం అందజేశారు.

ప్రత్యేక రైళ్ల పొడిగింపు .. 8 రైళ్లు రద్దు

ఏలూరు క్రైం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : వేసవి రద్దీని దృష్టిలో పెట్టుకుని ఏలూరు మీదుగా నడిచే రెండు ప్రత్యేక రైళ్లను పొడిగిస్తున్నట్టు దక్షిణమధ్య రైల్వే విజయవాడ డివిజన్ అధికారులు తెలిపారు. కాకినాడ టౌన్ లింగంపల్లి(07445) సోమ, బుధ, శుక్రవారాల్లో ప్రయాణించే రైలు ఏప్రిల్ 2వ తేదీ నుంచి జూన్ 30వ తేదీ వరకూ లింగంపల్లి నుంచి కాకినాడ టౌన్ (07446) మంగళ, గురు, శని వారాల్లో నడిచే రైలు ఏప్రిల్ 3వ తేదీ నుంచి జులై 1వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు తెలిపారు.

సామర్లకోట, పిఠాపురం, గొల్లప్రోలు, రావికంపాడు సెక్షన్ల పరిధిలో మార్చి 24వ తేదీన నాన్ ఇంటర్ లాకింగ్ పనులు నిర్వహిస్తున్న దృష్ట్యా ఏలూరు మీదుగా నడిచే రైళ్లను రద్దు చేస్తున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు తెలిపారు.

మార్చి 24వ తేదీన కాకినాడ పోర్టు - విశాఖపట్టణం, (17267) విశాఖపట్టణం - కాకినాడ పోర్టు (17268), రాజమండ్రి-విశాఖపట్టణం (67285) విశాఖపట్టణం- రాజమండ్రి (67286) విశాఖ పట్టణం-గుంటూరు (22875), గుంటూరు - విశాఖపట్టణం (22876) వెళ్లే రైళ్లను రద్దు చేస్తున్నట్టు తెలిపారు. గుంటూరు - విశాఖపట్టణం (17239) మార్చి 23, 24 తేదీల్లో , విశాఖపట్ణం - గుంటూరు (17240) మార్చి 24, 25 తేదీలలో రద్దు చేస్తున్నామన్నారు.

సీఎంవో స్టిక్కర్ పెట్టుకుని మోసగిస్తున్న ఒకరి అరెస్టు


పోలీసుల అదుపులో నిందితుడు

ఏలూరు క్రైం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : కారుకు సీఎంవో (చీఫ్ మినిస్టర్ ఆఫీస్) స్టిక్కర్ పెట్టుకుని పలువురిని బెదిరిస్తూ మోసాలకు పాల్పడుతున్న ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఏలూరు జిల్లా ఎస్పీ కె.పి.ఎస్.కిశోర్ తెలిపారు. ద్వారకాతిరుమల మండలం పి.లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఊరకరణం జగన్నాథరావు అలియాస్ జగన్ (43) ప్రస్తుతం కామవరపుకోటలోని మారుతీనగర్‌లో ఉంటున్నాడు. గతంలో జగన్ తపస్య గ్లోబల్ స్కూల్ అండ్ కాలేజీని ఎలాంటి అనుమతులు లేకుండా ప్రారంభించి విద్యార్థులను చేర్చుకున్నాడు. తన స్కూల్లో చేర్చుకున్న విద్యార్థులను కామవరపుకోటలోని విశ్వతేజా స్కూల్లో చేర్చుకోవాలని యజమానిని కోరాడు. అతను నిరాకరించడంతో తాను సీఎంవోలోని ఏపీసీఆర్డీఏలో వైస్ చైర్మన్‌గా పనిచేస్తున్నాని బెదిరింపులకు పాల్పడ్డాడు. ఐదు లక్షలు ఇవ్వకపోతే స్కూల్ అనుమతులు రద్దు చేయిస్తానంటూ హెచ్చరించాడు. దీంతో బాధితుడు తడికలపూడి పోలీసులకు ఈ నెల 18న ఫిర్యాదు చేశాడు. స్పందించిన పోలీసులు బెదిరింపులకు పాల్పడిన జగన్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేసి అతని నుంచి కారును స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. నిందితుడు తన కారుపై సీఎంవో అనే స్టిక్కర్ పెట్టి పోలీస్ సైరన్ కూడా అమర్చుకుని బెదిరింపులకు పాల్పడుతున్నాడు. ఈ నెల 17న తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల సమీపంలోని వీరవల్లిటోల్ ప్లాజా సిబ్బందితో తాను సీఎంవోలో ఉన్నాని గొడవ చేస్తుండగా ఓ రిపోర్టర్ వీడియో తీస్తుండగా అతడిని బెదిరించినట్టు తెలిపారు. 2020లో జంగారెడ్డిగూడెంలో లెక్చరర్‌గా పనిచేస్తూ యాజమాన్యానికి తెలియకుండా విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేసి మోసం చేశాడన్నారు. జంగారెడ్డిగూడెంలోని వికాస్ కాలేజీలో పార్టనర్‌లను, భవన యజమానులను బెదిరించి మోసం చేశాడన్నారు. 2023లో ఎలాంటి అనుమతులు లేకుండా డీజే సౌండు బాక్స్‌లతో రోడ్డు బ్లాక్ చేసి పోలీసులపై పెట్రోలు పోసి హత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. ఈ నేపథ్యంలో నిందితుడైన కరణం జగన్నాధరావు అలియాస్ జగన్‌ను అరెస్టు చేసి చింతలపూడి కోర్టుకు హాజరు పర్చగా రిమాండ్ విధించారని ఎస్పీ తెలిపారు. అనుమతులు లేకుండా పోలీస్ సైరన్ కాని, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ స్టిక్కర్లు, ప్రభుత్వ అధికారులమని వాహనాలపై స్టిక్కర్లు వినియోగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. ఇలాంటి వారు ఉంటే 112 కాని, 95503 51100కు లేదా 83329 59175కు సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

పిచ్చుకా .. క్షేమమా ?



కనిపించని పిచ్చుకలు
సెల్ టవర్ల రేడియేషన్‌తో కనుమరుగు
పక్షుల సంరక్షణకు చర్యలేవి
నేడు ప్రపంచ పిచ్చుకల దినోత్సవం

ఇంటి చూరులో ఆవాసం ఏర్పరచుకుని ఆహ్లాదాన్ని పంచే పిచ్చుకలు కనుమరుగైపోతున్నాయి. పంట చేలల్లో, ఇంటి ముంగిళ్లలో, ధాన్యపు రాశుల్లో కిలకిలమంటూ సందడి చేసేవి. కిచకిచమని అరుస్తూ ఇంట్లోకి ప్రవేశించి మనల్ని పలకరించే పిచ్చుకలు నేడు కనుమరుగవుతున్నాయి. ఊరి మధ్యలో ఉన్న మర్రిచెట్టు, రావి చెట్లపై గూళ్ళు కట్టుకొని సాయంత్రం అయ్యేసరికి చేరుకుని సందడి చేసేవి. ఆధునిక జీవన పోకడలతో పిచ్చుకలు అంతరించిపోతున్నాయి. పిచ్చుకలను సంరక్షించాలన్న లక్ష్యంతో ఏటా మార్చి 20 తేదీన ప్రపంచ పిచుకల దినోత్సవం జరుపుకుంటున్నారు. అంతరించి పోతున్న సహజ జీవ వైవిధ్యం, జాతుల సంరక్షణ అవసరాన్ని గుర్తించి వాటిని కాపాడుకునేందుకు ప్రజలను ఏకం చేయడమే ఈ పిచ్చుకల దినోత్సవ ముఖ్య ఉద్దేశ్యం.

నిడమర్రు మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు ఏ ఊరికి వెళ్లినా పలకరించేవి పిచ్చుకలే. కిచకిచ మంటూ మన చుట్టూ తిరుగుతూ ఎంతో ఆహ్లాదకరంగా ఉండేవి. ధాన్యం గింజలో, బియ్యం నూకలో వేస్తే ఎక్కడో చెట్టు కొమ్మలో కూర్చున్నవి కూడా చటుక్కున వచ్చి వాలేవి. కానీ నేడు పట్టణాల లోనే కాదు పల్లెల్లో కూడా పిచ్చుకల కిచకిచలు వినబడడం లేదు. ఇళ్ల మధ్యలో సెల్‌టవర్లు ఏర్పాటు చేయడంతో రేడియేషన్ ప్రభావం ఎక్కువగా ఉండి పిచ్చుకల గుండె, నాడీ వ్యవస్థలపై తీవ్ర ప్రభావం కల్గి చనిపోతున్నాయి. శరవేగంగా పట్టణీకరణ, అంతరిస్తున్న పచ్చదనం, రసాయనాలతో కూడిన పళ్లు, ఆహారధాన్యాలను తినడంతో పిచ్చుకలు అంతరించి పోవడానికి ప్రధాన కారణమని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రేడియేషన్ ప్రభావం ఎక్కువ

ఇతర ప్రాంతాల్లో నివసించే పక్షలతో పోలిస్తే సెల్ టవర్ దగ్గర నివసించే పక్షుల జీవితకాలం తగ్గుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. సెల్ టవర్ దగ్గర రేడియో ఫ్రీక్వెన్సీ బ్యాలెన్సింగ్ సరిగా లేకపోవడం , 30 డెసిబుల్ తరంగాల వల్ల కలిగే ఒత్తిడికి పిచ్చుకల రోగనిరోధక వ్యవస్థ బలహీనపరు స్తుంది. తద్వారా వ్యాధులు తొందరగా సంక్రమించి చనిపోతు న్నాయి. సెల్ కంపెనీలు హైఫ్రీక్వెన్సీ రేడియేషన్ ఉపయోగించడం వల్ల పక్షులకు హాని కలుగుతోంది. ఇటీవల సెల్ కంపెనీలు 5జి నెట్‌వర్క్ కోసం 24 -60 జిహెచ్ బ్యాండ్ ఫ్రీక్వెన్సీ రేడి యేషన్‌ని కూడా వాడుతున్నారు. దీంతో పిచ్చుకలతో పాటు రామ చిలుకలు, రాబందులు, పావురాలపై కూడా ఈ రేడియేషన్ ప్రభావం కలుగుతోందని పర్యావరణవేత్తలు గగ్గోలు పెడుతున్నారు.

• టెక్నాలజీతో పక్షిజాతుల మనుగడకు ఇబ్బంది



నేటి ఆధునిక జీవన పోకడల వల్ల పక్షిజాతులపై తీవ్ర దుష్ప్రభావం పడుతోంది. సెల్ కంపెనీలు ఉపయోగించే హైఫ్రీక్వెన్సీ రేడియేషన్ ప్రభావం వల్ల పిచ్చుకల రోగనిరోధక వ్యవస్థ, హృదయ స్పందన రేటు దెబ్బతిని చనిపోతున్నాయి. దీని కోసం ప్రభుత్వం ప్రత్యేక విధివిధానాలు రూపొందించి పక్షిజాతి స్నేహ పూర్వక టెక్నాలజీ విధానాలను అమలయ్యేలా చర్యలు చేపట్టాలి. చెట్లు పెంపకం, పరిసరాల పచ్చదనం కార్యక్రమాల పట్ల శ్రద్ధ వహించాలి.

డాక్టర్ గుడాల సత్యప్రతాప్ అసోసియేట్ ప్రొఫెసర్,గణపవరం

• పక్షుల పట్ల అవగాహన పెంచుకోవాలి



మా ఇంటి డాబాపై నిత్యం బియ్యం కానీ, ధాన్యం గింజలు చల్లుతుంటాను. గింజలు చల్లిన కాసేపటికి వివిధ పక్షులు, రామ చిలుకలు, పావురాలు, పిచ్చుకలు వచ్చి ఆ గింజలు తింటాయి. రోజూ సుమారు 700 నుంచి 1500 వరకు పక్షులు వచ్చి ఆహారం తీసుకొని ఎగిరి పోతాయి. పర్యావరణం, పక్షుల రక్షణ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలి.

పెరుమాళ్ల దినకర ఆకర్ష్, పక్షుల ప్రేమికుడు, గణపవరం

పక్షుల అభివృద్ధికి కృత్రిమ గూళ్లు



జంగారెడ్డిగూడెం (ఆంధ్ర జ్యోతి) జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన జువాలజీ అధ్యాపకుడు డాక్టర్ వీరా మహేష్ తన ఇంటి వద్ద పిచ్చుకల కోసం 2009లో ఒక అట్టపెట్టెను తయారు చేసి పెట్టారు. పిచ్చుకలు ఆ అట్టపెట్టెలోకి వచ్చేవి. అక్కడే తమ జాతిని అభివృద్ధి చేసుకోవడం చూసిన ఆయన 2012 నుంచి పిచ్చుకల సంరక్షుడిగా మారారు. ఇప్పటి వరకు చెక్కతో 750 వరకు పిచ్చు కల ఆవాసాలను (గూడు) తయారుచేసి పక్షుల ప్రేమికులకు ఉచితంగా అందజేస్తున్నారు. గణపవరం మండలం ముప్పర్తి పాడు గ్రామస్తుల కోరిక మేరకు 2017లో ఆరు జతల పిచ్చుకలను ఆ గ్రామంలో వాటికి 20 ఆవాసాలు (గూళ్ళు) ఏర్పాటు చేసి విడిచిపెట్టారు. ఇప్పుడు రెండు వందలకు పైగా అభివృద్ధి చెందాయి. పిచ్చుకలపై ఆయనకున్న ప్రేమతో కృత్రిమ ఆవాసాల ద్వారా పిచ్చుకల జనాభా పునరుద్ధరణపై రీసెర్చ్ చేసి థీసెస్‌ను మచిలీపట్నం కృష్ణా యూనివర్శిటీకి సబ్‌మిట్ చేయగా యూనివర్శిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది.

పిచ్చుకలను సంరక్షించుకోవాలి



ప్రకృతిలో భాగమైన పిచ్చుకల సంఖ్య తగ్గిపోకుండా వాటిని కాపాడాలి. సెల్ ఫోన్ టవర్స్ రేడియేషన్ వల్ల వాటికి పెద్దగా ప్రమాదం లేదని నా రీసెర్చ్‌లో తెలిసింది. ఫిబ్రవరి నుంచి సెప్టెంబరు మధ్యలో పిచ్చుకలు వాటి సంతానోత్పత్తిని పెంచు కుంటాయి. ఆ సమయాల్లో మూడు నుంచి ఐదు గుడ్లు పెట్టి పొదుగుతాయి. పక్షి ప్రేమికులు తమ ఇళ్ళ వద్ద వాటికి కృత్రిమ గూళ్ళు అందుబాటులో ఉంచితే అవి సంతానోత్పత్తి చేస్తాయి.

- డాక్టర్ వీరా మహేష్, జువాలజీ అధ్యాపకుడు, పిచ్చుకల సంరక్షకుడు, జంగారెడ్డిగూడెం

చిన వెంకన్న ఆలయంలో కిలకిలారావాలు

ద్వారకాతిరుమల (ఆంధ్రజ్యోతి): పట్టణీకరణ, అంతరిస్తున్న పచ్చదనం, రసాయనాలు నిండిన పళ్ళ, ఆహార ఉత్పత్తులు, సెల్ టవర్ల నుంచి వెలువడే అయస్కాంత తరంగాలు ఈ జాతికి ముప్పుగా పరిణమించాయి. పిచ్చుకలను సంరక్షించేందుకు ద్వారకా తిరుమల శ్రీవారి ఆలయ అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ఆలయ ఆవరణలోని పందిళ్లకు, బొగడ చెట్ల కొమ్మలకు ధాన్యం కంకులను ఏర్పాటు చేసి, వాటికి ఆహారం అందిస్తున్నారు. తాగేందుకు మంచినీటిని సైతం ఏర్పాటు చేస్తున్నారు. పక్షి జాతుల పట్ల ఆలయ అధికారులు చూపుతున్న ప్రేమను పలువురు భక్తులు అభినందిస్తున్నారు.



పక్షులతో ప్రశాంతత



ఒకప్పుడు ఆలయగోపురాల్లో పిచ్చుకలు, పావురాలు ఎక్కువగా ఉండేవి. అయితే పల్లెలు, పట్టణాల్లో వస్తున్న మార్పులు, బహుళ అంతస్తు కట్టడాలు, వాయు, శబ్ద కాలుష్యం, రేడియేషన్ తట్టుకుని నిలబడే శక్తి లేక ఇవి అంతరిస్తున్నాయి. పల్లెల్లోనూ పిచ్చుకలు కన్పించడం లేదు. వీటికి కనీసం సరైన ఆహారం అందిస్తే కొంత కాలం మన కళ్లముందుంటాయన్న ఆశతో నిత్యం ఆలయంలో వాటికి ధాన్యం,మంచినీటిని అందుబాటులో ఉంచుతున్నాం. పచ్చని మొక్కలు.. వాటిపై వాలే పక్షుల కిలకిలారావాలు ఆలయ పరిసరాలకు ప్రశాంతతను చేకూరుస్తాయి.

-ఎన్వీ సత్యనారాయణమూర్తి, దేవస్థానం ఈవో

నోటి ఆరోగ్యం ..జాగ్రత్త

వదిలేస్తే దీర్ఘకాలిక రోగాలకు అవకాశం

నేడు ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం



లింగపాలెం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది అంటారు. ప్రస్తుత కాలాన్ని బట్టి నోరు మంచి దైతే మన ఆరోగ్యం కూడా మంచిదవుతుందని చెప్పవచ్చు. నోరు శుభ్రంగా లేకుంటే బ్యాక్టీరియా నోటి ద్వారా శరీరంలోకి ప్రవేశించి దంతాలు పుచ్చిపోవడం, నోటిక్యాన్సర్ లాంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. చిన్న పిల్లలు ఏమైనా తిన్న తరువాత శుభ్రంగా ఉంచుకునేలా తల్లిదండ్రులు అర్థమయ్యేలా చెప్పాలి. నోరు శుభ్రంగా లేకుంటే దంత సంబంధిత వ్యాధులతో పాటు మతిమరుపు, గుండె సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశముందని పలువురు దంతవైద్యులు చెపుతున్నారు. నోటిశుభ్రతపై ప్రజలలో అవగాహన పెంచేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్చి 20వ తేదీని ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవంగా ప్రకటించింది.

ఎక్కువ శాతం వైరస్‌లు, బ్యాక్టీరియాలు నోటినుంచే శరీరంలోకి ప్రవేశిస్తాయి. నోరు, దంతాలను శుభ్రంగా కడగక పోవడం, ధూమపానం, మద్యపానం సేవించడం వల్ల నోటి దుర్వాసన, నోటిలో దంతక్షయం, నోటిలోపల పుండ్లు వచ్చేందుకు అవకాశం ఉంది. తరచూవచ్చే నోటి సమస్యలను పరిష్కరించు కునేందుకు ఉదయం, సాయంత్రం నోటిని ఐదు నిమిషాల పాటు శుభ్రప రచుకోవాలి. ధూమపానం, పొగాకు సంబంధిత ఉత్పత్తులు, గుట్కా వంటి వాటికి దూరంగా ఉండటం వల్ల కొంతమేర నోటి సమస్యలను అరికట్టవచ్చు.

దీర్ఘకాలిక వ్యాధులు వచ్చే ప్రమాదం



నోటి ఇన్‌ఫెక్షన్ల వల్ల దీర్ఘకాలిక వ్యాధులు సంక్రమిస్తాయి. నోటిలో ఉన్న బ్యాక్టీరియా శ్వాసకోశాల ద్వారా, లాలాజలం ద్వారా ఊపిరితిత్తులలోకి, జీర్ణవ్యవస్థలోకి ప్రవేశించి న్యుమోనియా, దంతక్షయం, చిగుళ్లవ్యాధి, నోటిక్యాన్సర్, జీర్ణసమస్యలతో పాటు గుండె, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు వస్తాయి. చిన్నపిల్లలు, పెద్దవారిలో ముఖ్యంగా వ్యాధి నిరోధకశక్తి తక్కువగా ఉన్నవారిలో నోటి ఇన్ఫెక్షన్‌ల వల్ల వ్యాధుల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం దంతాలు, నోటి సంబంధిత వ్యాధులకు అధునాతన వైద్యం అందుబాటులో ఉంది. నోటి సమస్యలు వస్తే తప్పకుండా దంతవైద్యులను సంప్రదించాలి.

డాక్టర్ పసుపులేటి దినేశ్, డెంటల్ సర్జన్, ప్రభుత్వ ఆసుపత్రి, నూజివీడు

బలహీనమైన రోగ నిరోధక వ్యవస్థ కారణం



దంతాలు పాడవటం, ఆరోగ్య సమస్యలు ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయి. నోటి సంబంధిత వ్యాధులకు బలహీనమైన రోగ నిరోధక వ్యవస్థ ప్రధాన కారణం, రోగ నిరోధక వ్యవస్థ తగ్గినప్పుడు శరీర ఇన్ఫెక్షన్‌లు, నోటిలో బ్యాక్టీరియల్, వైరల్ ఇన్ఫెక్షన్లకు దారితీస్తుంది. నోటి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల గుండెజబ్బులు, మధుమేహం, గొంతు, శ్వాసకోశ ఇన్ఫెక్షన్‌లు వచ్చే అవకాశాలు ఎక్కు వగా ఉంటాయి. నోటి ఇన్ఫెక్షన్‌లు రాకుండా ఉండాలంటే ఉదయం తినకముందు రాత్రి తిన్న తరువాత రోజుకు రెండుసార్లు క్రమం తప్పకుండా దంతాలతో పాటు నోటిని కూడా శుభ్రపరుచుకోవాలి.

డాక్టర్ రామ్ విజయానంద్, దంత వైద్యనిపుణుడు, ధర్మాజీగూడెం, లింగపాలెం మండలం


ఫోన్ పోగొట్టుకున్న మహిళకు ఫోన్ అందిస్తున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

రూ. 23 లక్షల విలువైన సెల్‌ఫోన్లు రికవరీ

భీమవరం క్రైం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) చోరీకి గురైన, పోగొట్టుకున్న సుమారు రూ. 23 లక్షల విలువ గల 155 సెల్‌ఫోన్లను తిరిగి బాధితులకు అందజేశారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి బాధితులకు అందించారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా రూ. 2 కోట్ల 9 లక్షల 10 వేలు విలువ చేసే 1,394 సెల్‌ఫోన్లు బాధితులకు అందించామన్నారు. మొబైల్ పోగొట్టుకుంటే 91549 66503 నంబర్‌కు హాయ్ అని గాని, హెల్ప్ అని గాని మెస్సేజ్ చేస్తే వచ్చిన లింక్ ద్వారా సంబంధించిన వివరాలు పంపిస్తే మొబైల్ రికవరీ చేస్తామన్నారు. లింక్‌లో వివరాలు నింపడం ద్వారా పోలీస్ స్టేషన్‌కు వెళ్ళకుండా సంబంధించిన అధికారులు వివరాలు నమోదు చేసుకుంటారన్నారు. బిల్లులు లేని సెల్ ఫోన్లను దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు అందజేయాలని తెలిపారు. 155 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందించడంలో కృషిచేసిన మహిళా పోలీస్ స్టేషన్ సీఐ అహ్మదున్నీసా, ఎస్ఐ నాగేశ్వరరావు, సిబ్బంది రత్నంరెడ్డి, కుమార్, శ్రీనివాస్, లక్ష్మీకుమారి, పాపారావు, ప్రసాద్‌బాబు, భాస్కర్, సునీల్‌కుమార్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

క్రైమ్ కార్నర్

భారీ దోపిడీకి స్కెచ్ వేసిన బ్యాంక్ ఉద్యోగి

నిందితుడిని పట్టుకున్న పోలీసులు

2 పిస్టల్స్, 17 బుల్లెట్లు స్వాధీనం

కాకినాడ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అతడో బ్యాంకు ఉద్యోగి. ఆన్‌లైన్ బెట్టింగ్, ఇతర వ్యసనాల కారణంగా పనిచేసే బ్యాంకులో బంగారు ఆభరణాలు చోరీ చేసి సస్పెండ్ అయ్యాడు. సులువుగా డబ్బులు సంపాదించేందుకు చోరీల బాటను ఎంచుకున్నాడు. చిన్నచిన్న చోరీలు చేస్తే ప్రయోజనం లేదని ఏదైనా బ్యాంకు, ఏటీఎంలో చోరీ చేస్తే జీవితంలో సెటిల్ అయిపోవచ్చనే దురుద్దేశంతో బిహార్ నుంచి 2 పిస్టల్స్ కొనుగోలు చేశాడు. మంగళవారం రాత్రి కాజులూరులో రెక్కీ నిర్వహిస్తోండగా కాకినాడ జిల్లా పోలీసులు అనుమానం వచ్చి నిందితుడిని పట్టుకున్నారు. 2 పిస్టల్స్, 17 బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ రూరల్ సర్కిల్ కార్యాలయంలో సీఐ డీఎస్ చైతన్యకృష్ణ వివరాలను వెల్లడించారు. విశాఖపట్టణం మద్దిలపాలెం ఫిష్‌మార్కెట్ సమీపంలో గ్రూప్‌హౌస్‌లో చిటికెల నాగేశ్వరరావు, భార్య కుటుంబ సభ్యులతో కలసి నివాసం ఉంటున్నాడు. అతడు గతంలో పశ్చిమ గోదావరి జిల్లా నిడమర్రు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులో ప్రొబేషనరీ ఆఫీసర్‌గా పనిచేసేవాడు. ఆన్‌లైన్ బెట్టింగ్ కారణంగా బ్యాంకు నుంచి 900 గ్రాముల బంగారాన్ని సొంత అవసరాలకు వాడుకోవడంతో సస్పెండ్ చేశారు. చిన్న చోరీలతో జీవితంలో స్థిరపడటం సాధ్యం కాదని గ్రహించిన నాగేశ్వరరావు భారీ దోపిడీకి స్కెచ్ వేశాడు. బీహార్ ముంగర్ ప్రాంతానికి వెళ్లి 2 పిస్టల్స్, 17 బుల్లెట్లు కొనుగోలు చేశాడు. దాంతో బ్యాంకు, ఏటీఎంల దోపిడీ చేసేందుకు విశాఖ సిటీ, రూరల్, నర్సీపట్నం, ఆంధ్ర, తమిళనాడు బోర్డర్‌లలో రెక్కీ నిర్వహించాడు. పక్కా సమాచారంతో జిల్లా ఎస్పీ ఆదే శాల మేరకు బుధవారం కాకినాడ జిల్లా పోలీసులు నిందితుడిని పట్టుకున్నట్లు ఎస్పీ బిందు మాధవ్ తెలిపారు. నిందితుడిపై నర్సీపట్నంలో 3 కేసులు, అన్నవరం, నక్కపల్లి, తాడేపల్లిగూడెం, ఏలేశ్వరం పీఎస్‌లో ఒక్కో కేసు ఉన్నట్టు తెలిపారు.


వివరాలు చెబుతున్న కాకినాడ ఎస్పీ.. స్వాధీనం చేసుకున్న పిస్టల్స్

కళ్లల్లో కారం కొట్టి దారిదోపిడీ

ముగ్గురి అరెస్టు.. లక్షా 90 వేల రూపాయల నగదు స్వాధీనం


వివరాలు చెప్తున్న ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్

ఏలూరు క్రైం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మోటారు సైకిల్‌పై వెళ్తున్న ఒక యువకుడి కళ్ళల్లో కారం కొట్టి దారిదోపిడీకి పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసి వారి నుంచి లక్షా 90 వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నామని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ తెలిపారు. హిందుస్థాన్ ఆదిత్య అసోసియేట్స్ కంపెనీ కలెక్షన్ ఏజెంట్లు ఏలూరు నగరంలో ఈ ఏడాది ఫిబ్రవరి 22వ తేదీన షాపుల నుంచి కలెక్షన్ చేసుకుని రాత్రి 11.30 గంటల సమయంలో ఏలూరులోని వన్‌టౌన్‌లోని అగ్రహారం కాంగ్రెస్ ఆఫీసు రోడ్డులో వెళ్తుండగా స్పీడు బ్రేకర్ వద్ద మోటారు సైకిల్ వేగం తగ్గించడంతో అక్కడ మాటు వేసి ఉన్న ముగ్గురు ఆగంతకులు ఏజెంట్ల కళ్ళల్లో కారం కొట్టి వారి వద్ద ఉన్న రెండు లక్షల 40 వేల 600 రూపాయల నగదు బ్యాగ్‌ను అపహరించుకుపోయారు. బాధితులు ఏలూరు వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ సత్యనారాయణ కేసు నమోదు చేశారు. వన్ టౌన్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు. సీసీఎస్ సీఐ రాజశేఖర్, వన్‌టౌన్ ఎస్ఐలు షేక్ మదీ నా బాషా, నాగబాబు, సీసీఎస్ ఏఎస్ఐ రాజ కుమార్, అహ్మద్, కానిస్టేబుళ్ళు మోహన కృష్ణ, నాగార్జున, శేషుకుమార్, యశ్వంత్ కుమార్, సురేష్‌కుమార్, రూహుళ్ళ బృందం నిఘా పెట్టారు. బుధవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఏలూరు గూడ్స్‌షెడ్ రోడ్డులో రాజా లాడ్జి సమీపంలో ముగ్గురు యువకులు మోటారు సైకిల్‌పై వస్తుండగా వారి కదలికలు అనుమానంగా ఉండడంతో అదుపులోకి తీసుకుని విచారణ చేయగా నేరానికి పాల్పడినట్లుగా అంగీకరించారు. వారి వద్ద నుంచి లక్ష 90 వేల రూపాయల నగదు, నేరానికి వినియోగించిన హీరో స్ప్లెండర్ మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు దక్షిణపువీధి పెద్ద దేవుని గుడి సమీపానికి చెందిన గుమ్మల మణికంఠ శ్రీని వాస్ (24), ఉంగుటూరు మండలం చేబ్రోలు పిట్టావారి వీధికి చెందిన కల్లపల్లి దుర్గానాగవెంటక కొండలరావు అలియాస్ పాండు, గాంధీబొమ్మ సెంటర్ దక్షిణపు వీధికి చెందిన కల్లపల్లి చందు అలియాస్ అచ్యుత్‌లను అరెస్టు చేశారు. వీరిని ఏలూరు కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారు. ప్రత్యేక బృందాన్ని ఎస్పీ అభినందించారు.

నేడు ఉపాధి పనులపై ప్రజావేదిక

తణుకు రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తణుకు మండలంలోని గ్రామ పంచాయతీలలో ఉపాధి పథకంలో నిర్వహించిన సామాజిక తనిఖీలలో గుర్తించిన అంశాలపై ఈ నెల 20వ తేదీన తణుకు మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావేదికను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో లోహిత్ జయ సాగర్ తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): 11 కేవీ చినఅమిరం ఫీడర్‌పై చెట్ల కొమ్మలు తొలగింపు, లైన్ల మరమ్మతుల నిమిత్తం ఈ నెల 20వ తేదీ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రాయలం బైపాస్ రోడ్డు ఏరియాలోని కొన్ని ప్రాంతాలు, చినఅమిరం గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.


హైకోర్టు న్యాయవాది ఆనందకుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి

తణుకు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలు యువత భవిష్యత్‌ను నాశనం చేయడమే కాక, ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయని, హైకోర్టు న్యాయవాది ఎం. ఆనందకుమార్ అన్నారు. బుధవారం ఎస్సీఐఎం డిగ్రీ కళాశాలలో ఈగిల్ క్లబ్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలతో అనర్థాలపై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆర్.కె. ఫణిధర్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మత్తు మాయలో పడవద్దని సూచించారు. అనంతరం ఆనంద కుమార్‌ను సత్కరించారు. క్లబ్ కన్వీనర్లు డాక్టర్ టి.సంధ్యారాణి, డి.కనక మహాలక్ష్మి, పద్మశ్రీ, జీవన్‌బాబు, కమల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త కౌలు రైతు చట్టాన్ని రూపొందించాలి

ఆచంట, మార్చి 19(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ నిబంధనలు తొలగించి ప్రభుత్వమే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చేలా చట్టం చేయాలని కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. కౌలు రైతులను ఆదుకోవాలని కోరుతూ గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద కౌలు రైతు సంఘం నాయకులు ఆందోళన చేసి తహసీల్దార్ కనకరాజుకు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా వైద్యాధికారికి పీఎంపీల అభినందన

గణపవరం/తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 19 (ఆంధ్ర జ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా వైద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన గీతాబాయిని పీఎంపీల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్లు, సభ్యులు బుధవారం భీమవరంలో కలసి సత్కరించారు. తమ సంఘం 60 వసంతాల సావనీర్ అందజేశారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సుబాన్, కోశాధికారి మునగాల జితేంద్ర, జిల్లా సంఘం సలహాదారు నిడమర్తి రంగాప్రసాద్ తదితరులు ఉన్నారు.

జీవన ప్రమాణ పత్రాలు మాన్యువల్‌గా స్వీకరించాలి

భీమవరం అర్బన్, మార్చి19 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్‌లో జీవన ప్రమాణ పత్రాలు సమర్పించని పెన్షన్‌దారుల జీవన ధ్రువీకరణ పత్రాలను మాన్యువల్‌గా తీసుకుని ఆమోదించాలని జిల్లా ఖజానా అధికారి ఎ. గణేశ్‌ను రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. వార్షిక తనిఖీల్లో భాగంగా భీమవరం సబ్ ట్రెజరీ కార్యాలయానికి విచ్చేసిన ఆయనను బుధవారం సంఘ నాయకులు గాత జేమ్స్, సాగిరాజు సత్యనారాయణరాజు, ప్రసాద్‌లు తదితరులు మర్యాద పూర్వకంగా కలిశారు. మంచంపై నుంచి లేవలేని విశ్రాంత ఉద్యోగులకు జీవన్ ప్రమాణ పత్రాలు సమర్పించడానికి ప్రత్యేక ఏర్పాటు చేయాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు.



సహకార సంఘాలతోనే గ్రామాల అభివృద్ధి

ఉండి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని జిల్లా సహకార బ్యాంక్ అధికారి ఎం.నాగరాజు అన్నారు. బుధవారం అంతర్జాతీయ సహకార సంవత్సరం 2025 పురస్కరించుకుని యండగండి విశాల సహకార సంఘం బ్యాంక్ వద్ద జెండాను ఆవిష్కరించి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. బ్యాంక్ కార్యదర్శి చెరుకువాడ రవికుమార్ అధ్యక్షత వహించారు. రాష్ట్ర సహకార యూనియన్ విజయవాడ జోనల్ విద్యాధికారి కె.బోజరంగరాజు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ రమణమూర్తి, రామదాసు సహకార సంవత్సరం ప్రాముఖ్యతను వివరించారు. భీమవరం సబ్ డివిజనల్ అధికారి జి.సత్యనారాయణ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ హనుమంతరావు, జీవనజ్యోతి, సహకార సిబ్బంది పాల్గొన్నారు.



సునీతా విలియమ్స్‌కు అభినందన

భీమవరం అర్బన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): సునీత విలియమ్స్ అంతరిక్షం నుంచి సురక్షితంగా భూమికి చేరడం పట్ల శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో డీఎన్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో అభినందనలు తెలిపారు. కళాశాల వైస్ ప్రెసిడెంట్ గోకరాజు పాండు రంగరాజు మాట్లాడుతూ మానవాళి నిరంతర ప్రగతికి ఇలాంటి ప్రయాణాలు కీలకమన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: సునీత విలియమ్స్ బృందానికి ఐద్వా నాయకులు అభినందనలు తెలిపారు. అన్ని రంగాల్లో మహిళలు దూసుకుపోతుండటానికి సునీత విలియమ్స్ నిదర్శనమన్నారు. ఆమెను చూసి మహిళలు మరింత ధైర్యవంతంగా ముందుకు సాగాలన్నారు. ఐద్వా కార్యదర్శి పి పూర్ణ, నాగలక్ష్మి, వరలక్ష్మిలు పాల్గొన్నారు.

నవ ధాన్యాలతో భూసారం పెంపు

అత్తిలి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రైతులు అనవసరంగా ఎరువులు వాడొద్దని మండల వ్యవసాయాధికారి టీకే రాజేష్ సూచించారు. ఉరదాళ్ళపాలెం, తిరుపతిపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. దాళ్వా పంట కోసే ముందు రైతులు నవధాన్యాల విత్తనాలు చల్లి భూసారాన్ని పెంచుకోవాలన్నారు. నవధాన్యాల కిట్లు కావాల్సిన వారు రైతు సేవా కేంద్రాలలో తమ పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు.

హోరాహోరీగా టెన్నిస్ పోటీలు

భీమవరం అర్బన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి) : భీమవరం కాస్మోపాలిటన్ క్లబ్‌లో జరుగుతున్న 4వ వెర్టెక్స్ అఖిలభారత సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ పోటీలు 5వ రోజు హోరాహోరీగా సాగాయి. బుధవారం డబుల్స్, సింగిల్స్‌లో పోటీలు జరిగాయి. 70+డబుల్స్‌లో రాంబాబు, సేటు, జీవీ సన్యాసిరాజు, గజపతి విజేతలుగా నిలిచారు. 35+సింగిల్ విభాగంలో కన్నన్, అమీత్, విజయానంద్, 45+ సింగిల్స్‌లో ఎంవీఎల్ రాజు, సంపత్, రామకృష్ణయన్, గోపాలకృష్ణ విజేతలుగా నిలిచారు.

విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ఉపాధ్యాయుల ఆరా

తణుకు రూరల్, 19 (ఆంధ్రజ్యోతి): టెన్త్ విద్యార్థులు ఒత్తిడి లేకుండా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని పైడిపర్రు జడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఎం. ఏడుకొండలు అన్నారు. బుధవారం పైడిపర్రు పాఠశాలలో చదివే టెన్త్ విద్యార్థుల ఇళ్లను సందర్శించి తల్లిదండ్రులను కలసి విద్యార్థుల చదువుపై ఆరా తీశారు. పరీక్షలు పూర్తయ్యే వరకూ విద్యార్థులు టీవీలకు, సెల్‌ఫోన్‌లకు దూరంగా వుండాలని సూచించారు. సబ్జెక్ట్ పట్ల అనుమానాల వస్తే నివృత్తి చేస్తామని చెప్పారు. పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మీటర్ రీడర్ల ఆందోళన

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో తమ ఉపాధి పోతుందని, తమకు ఉద్యోగ భద్రతతో కూడిన ఉపాధి కల్పించాలని మీటర్ రీడర్స్ సంఘ సభ్యులు ఆందోళన చేపట్టారు. తాడేపల్లిగూడెం డివిజినల్ కార్యాలయం వద్ద బుధవారం నిరసన తెలిపారు. అనంతరం తమకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం ఇవ్వాలని అధికారులకు వినతిపత్రం అందించారు.


గొంతేరు డ్రెయిన్ స్థలం పూడ్చేస్తున్న దృశ్యం

యథేచ్ఛగా డ్రెయిన్ కబ్జా!

» స్థలాల పూడ్చివేత » వరదలొస్తే ముప్పేనంటున్న స్థానికులు

మొగల్తూరు, మార్చి19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలపల్లిలోని 216 జాతీయ రహదారి వెంబడి గల గొంతేరు డ్రెయిన్ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. స్థలాలను ఇటీవల ఆక్రమణదారులు పూడ్చేసి పక్కా నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ డ్రెయిన్ సమీపం నుంచి జాతీయ రహదారి విస్తరించడం, బండి ముత్యాలమ్మ ఆలయం ఈ రహదారి సమీపంలోనే ఉండటంతో ఇక్కడ భూముల విలువ మరింత పెరిగింది. దీంతో ఆక్రమణదారులు వారికి గల పలుకుబడిని ఉపయోగించుకుని డ్రెయిన్ వెంబడి గల స్థలాలను పూడ్చేసి నిర్మాణాలు జరుపుతున్నారు. రానున్న రోజుల్లో వరదలు సంభవించి డ్రెయిన్ పొంగితే ఆక్రమణల కారణంగా డ్రెయిన్ నీరు గ్రామంలోకి లేదా జాతీయ రహదారి పైకి వచ్చే అవకాశం ఉందని గ్రామస్థులు, ప్రయాణికులు వాపోతున్నారు. డ్రెయిన్ స్థలం కబ్జా కాకుండా చూడాలని, ఇప్పటికే కబ్జాకు గురైన స్థలాలను గుర్తించేందుకు ముత్యాలపల్లి వంతెన నుంచి సర్వే చేపట్టి ఆక్రమణలు తొలగించాలని వారు కోరుతున్నారు.

రీ సర్వే వివరాలు రైతులకు తెలపండి : జేసీ

భీమవరం రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు ఆ సర్వే వివరాలను అందజేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్‌రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని జేసీ ఛాంబర్‌లో రీ సర్వే, ఆర్ఓఆర్, ఇనాం ఎస్టేట్, ల్యాండ్ గ్రౌండింగ్, వెబ్ ల్యాండ్ ఇష్యూ తదితర అంశాల పురోగతిపై జిల్లాలోని రెవెన్యూ డివిజన్ అధికారులు, తహసీల్దార్‌లు, మండల సర్వేయర్లతో ఆయన గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలోని రీ సర్వే పూర్తయిన 13 గ్రామాల్లో రైతులకు వివరాలు అందించాలని ఆయా శాఖల అధికారులను కోరారు. డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, కలెక్టరేట్ ల్యాండ్ సూపరింటెండెంట్ సిహెచ్. రవికుమార్, డీటీలు ఎం.సన్యాసిరావు, జీవన రాణి తదితరులు పాల్గొన్నారు.



సరుకుల పంపిణీలో అవకతవకలు ఉపేక్షించం

నిత్యావసర సరుకుల పంపిణీలో అవకతవకలు జరిగితే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని జేసీ హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లో పౌర సరఫరాల అధికారులు, ఎండీయు, రేషన్ డీలర్ల సంఘ అధ్యక్షులు, గ్యాస్ డీలర్ల ప్రతినిధులతో నిత్యావసర సరుకుల పంపిణీ, దీపం-2 గ్యాస్ సిలెండర్ల సరఫరాపై సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఐవీఆర్ఎస్ ద్వారా అమరావతి నుంచి నిత్యావసర సరుకుల పంపిణీపై ప్రజల అభిప్రాయాలను సమీకరిస్తుందన్నారు. డీఈఎస్‌వో ఎస్.సరోజ, ఏఎస్‌వో ఎం.రవిశంకర్, పౌర సరఫరాల డీటీలు, సీఎస్ఆర్‌ఐలు, తదితరులు పాల్గొన్నారు.


మొక్క నాటి నీరు పోస్తున్న ఆర్డీవో దాసి రాజు


ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

యలమంచిలి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతో పాటు పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని నరసాపురం ఆర్డీవో దాసి రాజు అన్నారు. 'స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా బుధవారం యలమంచిలి తహసీల్దారు కార్యాలయ ఆవరణలో ఆయన మొక్కను నాటారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ పర్యావరణానికి పెనుముప్పుగా పరిణమించిన ప్లాస్టిక్ వినియోగాన్ని విడనాడి.. ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తహసీల్దారు జి.పవన్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ డేవిడ్‌సన్ తదితరులు పాల్గొన్నారు.

కాల్వలు పరిశుభ్రంగా ఉంచాలి

భీమవరం అర్బన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కాలువలను పరిశుభ్రంగా ఉంచాలని.. వాటిలో ప్లాస్టిక్ వ్యర్థాలను వేయవద్దని నీటి పారుదల శాఖ డివిజనల్ ఇంజనీర్ పి. సత్యనారాయణ మూర్తి అన్నారు. బుధవారం భీమవరం పురపాలక సంఘం, శ్రీ విజ్ఞానవేదిక, నీటి పారుదల శాఖల ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి గుడ్డ, చేతి సంచులను వినియోగించాలన్నారు. సంఘ సేవకులు రంగసాయి, కంతేటి వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెన్త్ పరీక్ష

పెనుగొండ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రెండో రోజు పదవ తరగతి పబ్లిక్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మండలంలో 989 విద్యార్థులకు గాను 10 మంది గైర్హాజరైనట్టు ఎంఈవో శుభాకరరావు తెలిపారు.

నరసాపురం రూరల్: పట్టణ, మండలంలోని ఎనిమిది కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో 39 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో పుష్పరాజ్యం తెలిపారు. మొత్తం 1735 విద్యార్థులు హిందీ పరీక్ష రాయాల్సి ఉండగా 1696 మంది మాత్రమే హాజరయ్యారన్నారు.

మొగల్తూరు: పదవ తరగతి పరీక్షలకు 13 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఐదు పరీక్ష కేంద్రాల్లో 790 మంది విద్యార్థులకు గానూ 777 మంది హాజరయ్యారని ఎంఈవో శామ్యూల్ జాన్ తెలిపారు.

ఆకివీడు: పదో తరగతి హిందీ పరీక్ష బుధవారం ప్రశాంతంగా జరిగింది. విద్యార్థులు 10 మంది గైర్హాజరయ్యారు. మండల పరిధిలో నాలుగు కేంద్రాల్లో 905 మందికి గాను 895 మంది విద్యార్థులు హాజరయ్యారు.

కాళ్ళ: మండలంలో బుధవారం నిర్వహించిన హిందీ పరీక్షకు 14 మంది గైర్హాజరైనట్టు మండల విద్యాశాఖాధికారి ఏ.రవీంద్ర తెలిపారు. మండలం మొత్తం 722 మంది హాజరుకావాల్సి ఉండగా 708 మంది పరీక్ష రాసినట్లు వివరించారు.

22న ఉద్యోగ దిక్సూచి

ఆకివీడు రూరల్ మార్చి 19 (ఆంధ్ర జ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నదని జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి లోక్‌మాన్ అన్నారు. దుంపగడపలోని వీవీ గిరి ప్రభుత్వ కళాశాలలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 22వ తేదీ ఉదయం 10 గంటల నుంచి కళాశాలలో ఉద్యోగ దిక్సూచి కార్యక్రమం నిర్వహిస్తున్న ట్లు, 11 కంపెనీలు హాజరుకానున్నాయని తెలపారు. టెన్త్ నుంచి పీజీ వరకు, బీటెక్ వారికి అవకాశా లున్నాయని తెలిపారు. తమ విద్యార్హతలు, ఆధార్ కార్డు, బయోడేటాతో హాజరై నమోదు చేయించు కోవాలని తెలిపారు.


వీఆర్వోల నిరసన

ఉండి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): క్లస్టర్ కుదింపు విధానం వల్ల వీర్వోలకు పనిభారం పెరుగుతుందని పాత విధానమే అమలుచేయాలని మండల వీర్వోల సంఘం అధ్యక్షుడు చిన్నారావు డిమాండ్ చేశారు. సంఘం పిలుపు మేరకు బుధవారం ఉండిలో నిరసన కార్యక్రమంను నిర్వహించి అనంతరం తహసీల్దారు నాగార్జునకు వినతిపత్రంను అందించారు.


సభ్యత్వ కార్డులు అందజేస్తున్న పొత్తూరి

కార్యకర్తలకు అండగా టీడీపీ

మొగల్తూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు అండగా ఉండేది టీడీపీ మాత్రమేనని నియోజకవర్గ ఆ పార్టీ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు అన్నారు. బుధవారం పార్టీ మండల అధ్యక్షుడు గుబ్బల నాగరాజు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం పొందిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటుందన్నారు. దేశంలో మరేపార్టీ ఇవ్వని ఇన్సూరెన్స్ పథకాన్ని టీడీపీ అమలు చేస్తోందని వివరించారు. ఈ సందర్భంగా ఇటీవల పార్టీ సభ్యత్వం పొందిన కార్యకర్తలకు గుర్తింపు కార్డులను అందించారు. మండలంలోని 17 గ్రామాలకు సంబదించిన పార్టీ నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, బూత్ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.


ఉచితంగా మందులు అందిస్తున్న బొలిశెట్టి రాజేష్

బొలిశెట్టి రాజేష్ జన్మదినం సందర్భంగా జనసేన సేవా కార్యక్రమాలు

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెంలో జనసేన యువనేత బొలిశెట్టి రాజేష్ పుట్టినరోజు సందర్భంగా నియోజకవర్గంలో జనసైనికులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కడియద్దలో ఆకాశం ఆసుపత్రి సహకారంతో గుండె, జనరల్, కంటి పరీక్షలు నిర్వహించారు. గర్భిణులకు పౌష్టికాహారం అందించారు. పట్టణంలోని వీకర్స్ కాలనీలో చైతన్య ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. పడాల వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. పట్టణ అధ్యక్షుడు వర్తనపల్లి కాశీ, రూరల్ అధ్యక్షుడు అడపా ప్రసాద్, పుల్లా బాబి పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ

సబ్‌స్టేషన్ పరిశీలన

పెనుగొండ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్ళుగా అప్రోచ్ రహదారి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పెనుగొండలోని 133 కేవీ స్టేషన్‌ను ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ పరిశీలించారు. గతంలో ఉన్న బైపాస్ రహదారి మూసి వేయడంతో అప్రోచ్ రహదారి లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ తరుణంలో ఎమ్మెల్యే పితాని దృష్టికి విద్యుత్ శాఖాధికారులు తీసుకెళ్ళగా పరిశీలించి సమస్య పరిష్కరిస్తామన్నారు. విద్యుత్ సమస్యలు రాకుండా ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం పెంచుతున్నట్లు తెలిపారు. సర్పంచ్ నక్కా శ్యామలా సోని శాస్త్రి, ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఎ. రఘునాథ్‌బాబు, నరసాపురం ఈఈ కె. మధు కుమార్, ఏడీఈ రామకృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.



వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఆందోళన

పాలకొల్లు టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలపడాన్ని వ్యతిరేకిస్తూ పి.వి.రావు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మాపు సూర్యవరప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక గాంధీ బొమ్మల సెంటరు వద్ద మాల మహానాడు కార్యకర్తలు బుధవారం నిరసన తెలిపారు. గుమ్మాపు మాట్లాడుతూ తప్పుల తడకతో కూడిన రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్‌ను రద్దుచేసి హైకోర్టు న్యాయమూర్తులతో త్రిసభ్య కమిటీ వేసి న్యాయ విచారణ చేయాలని డిమాండ్ చేశారు.

ఆచంట: ఆచంట పెదపేటలో అంబేడ్కర్ విగ్రహం వద్ద మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో ప్రభుత్వం నిరంకుశ వైఖరి విడనాడాలన్నారు. బీరా మధు, సుంకర సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.


బహుమతులందిస్తున్న ఆర్టీసీ డీఎం సుబ్బన్నరెడ్డి

క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతులు

నరసాపురం రూరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో జనవరి 25 నుంచి మార్చి 17 వరకు అంతర్గత గేమ్స్, స్పోర్ట్స్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బుధవారం ఆర్టీసీ డీఎం సుబ్బన్నరెడ్డి బహుమతులందించి మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి చూపించాలన్నారు. చైర్మన్ కెవి సత్యనారాయణ, కోశాధికారి త్రినాద్, డైరెక్టర్ ఆడ్డాల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.


చెక్కులు అందిస్తున్న సేవా సమితి సభ్యులు

అల్లూరి సేవా సమితి వితరణ

పాలకొల్లు టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు క్షత్రియ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు సేవాసమితి దాతృత్వంతో నలుగురు వ్యాధిగ్రస్తులకు రూ.20,000 ఆర్థికసాయం అందించారు. వై.సుబ్బలక్ష్మి, వి.సత్యనారాయణరాజు, బి.సూర్యనారాయణ రాజు, పి.రామకృష్ణంరాజుకు రూ. 5 వేల చొప్పున సమితి కార్యవర్గ సభ్యులు అందజేశారు.

పట్టణ బీజేపీ అధ్యక్షుడిగా వబిలిశెట్టి

భీమవరం అర్బన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): భీమవరం పట్టణ బీజేపీ అధ్యక్షుడిగా వబిలిశెట్టి ప్రసాద్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను బుధవారం పార్టీ పార్లమెంటు కార్యాలయంలో ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. పార్టీ నాయకులు, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.


గోగులమ్మను పూలతో అలంకరించిన దృశ్యం

ఆధ్యాత్మికం

ఘనంగా గోగులమ్మ జాతర

నరసాపురం టౌన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రుస్తుంబాదాలో కొలువైన గోగులమ్మ జాతర బుధవారం ఘనంగా జరిగింది. అమ్మవార్ని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎమ్మెల్యే జానకీరామ్‌లతో పాటు పట్టణానికి చెందిన పలువురు దర్శించుకుని అమ్మవారికి పూజలు చేశారు.

గునుపూడిలో అమ్మవార్ల ఊరేగింపు

భీమవరం అర్బన్: గునుపూడిలో ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పోలేరమ్మ వార్ల జాతర బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లను వివిధ రకాల వాయిద్యములతో గరగలతో ఊరేగించారు. ఆసాదులు అమ్మవారిని ప్రతి ఇంటి ముందుకు తీసుకు వచ్చి దర్శనాలు చేయించారు. భక్తులు అమ్మవారికి హారతులిచ్చి పూజలు చేశారు.

భారీ అన్నసమారాధనలు

కాళ్ళ: బొండాడలో పోలేరమ్మ, మహాలక్ష్మి అమ్మవార్ల 50వ జాతర మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధన నిర్వహించారు. తొలుత అమ్మవార్లకు భారీ నైవేద్యం సమర్పించారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు, నీటి సంఘం అధ్యక్షుడు మందపాటి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరు: మొగల్తూరు కోట వద్ద వేంచేసియున్న మరిడి మహాలక్ష్మీ అమ్మవారి జాతర ఉత్సవాలు ముగింపు సందర్భంగా బుధవారం ఘనంగా అన్న సమారాధన నిర్వహించారు.

స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం అర్బన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన తరగతుల నుంచి స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జనరిక్ ఫార్మసీలు, ఎంఎస్ఎంఈ యూనిట్ల ఏర్పాటుకు సబ్సిడీతో కూడిన రుణాలను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. దారిద్ర్య రేఖకు దిగువనున్న అర్హులైన లబ్ధిదారులు ఆన్‌లైన్ ద్వారా మార్చి 22వ తేదీ లోపుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. లబ్ధిదారులు 21 సంవత్సరాలు నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉండాలని, రైస్ కార్డు, కమ్యూనిటీ సర్టిఫికెట్, జనరిక్ ఫార్మసీ కోసం బి. ఫార్మసీ లేక డి. ఫార్మసీ సర్టిఫికెట్ కలిగి ఉండాలన్నారు.

రేషన్ కార్డుదారులు ఈకేవైసీ చేయించాలి

ఆచంట, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఆచంట మండలంలోని అన్ని గ్రామాల్లో రేషన్ కార్డు దారులందరూ ఈకేవైసీ వేయించుకోవాలని తహసీల్దార్ జి. కనకరాజు తెలిపారు. ఆయా గ్రామాల్లో లబ్ధిదారులంతా గ్రామ రెవెన్యూ అధికారి వద్ద గాని, రేషన్‌షాపు డీలర్ వద్ద గానీ లిస్టులో పేర్లు ఉన్న వారందరూ ఈకేవైసీ వేయించుకోవాలని కోరారు.

ఆధార్ మొబైల్ క్యాంపులు

ఇరగవరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక ఆధార్ నమోదు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎ. శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లోని సచివాలయాలు, అంగన్వాడీ కేంద్రాల వద్ద ఈ నమోదు కార్యక్రమం ఈ నెల 28 వరకు జరుగుతుందని ఈ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

26న సర్వసభ్య సమావేశం

పెనుగొండ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పెనుగొండ మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 26న సర్వసభ్య సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మూర్తి తెలిపారు. ఉదయం 10.30లకు అధికారులంతా హాజరుకావాలని కోరారు.

కాళ్లకూరు శ్రీవారి హుండీ లెక్కింపు

కాళ్ళ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కాళ్ళకూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం హుండీల లెక్కింపు జరిగింది. 58 రోజులకుగాను రూ. 13 లక్షల 74 వేల 218 లభించినట్టు ఆలయ ఈవో ఎం.అరుణ్‌కుమార్ తెలిపారు. దేవదాయ ధర్మదాయ శాఖ తనిఖీదారు వర్ధినీడి వెంకటేశ్వరరావు, గ్రామపెద్దల సమక్షంలో హుండీలు తెరచి లెక్కించినట్లు ఈవో స్పష్టం చేశారు.

●ఆకివీడు: పెద్దింట్లమ్మ, వనువులమ్మ ఆలయాల్లో హుండీలు బుధవారం లెక్కించారు. స్థానిక పెద్దింట్లమ్మ ఆలయ హుండీని లెక్కించగా రూ.2,13,510లు, వనువులమ్మ హుండీ ఆదాయం రూ.90,371లు వచ్చినట్టు ఆలయాల మేనేజర్ అల్లూరి వెంకట సత్యనారాయణరాజు తెలిపారు. ఈవోలు డీవీ కృష్ణంరాజు, ఎం.రఘునాథ్ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల వేళల మార్పు

ఇరగవరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : వేసవి దృష్ట్యా అంగన్‌వాడీ కేంద్రాల పనివేళలు మార్పు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఐసీడీఎస్ తణుకు సీడీపీఓ ప్రమోదిని కుమారి తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రి స్కూల్ నిర్వహిస్తున్నట్లు సూచించారు. సిబ్బంది మధ్యాహ్న భోజన పథకం కచ్చితంగా అమలు చేయాలన్నారు.

22కు వేలం వాయిదా

ఆకివీడు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : నగర పంచాయతీ పరిధిలోని వివిధ మార్కెట్లకు సంబంధించి బహిరంగ వేలం పాటలు ఈ నెల 22కు వాయిదా పడ్డాయి. రోజువారి మార్కెట్, వారపు సంత, కబేళా, కొబ్బరి చెట్ల ఫలసాయం, పాత పేపర్లకు సంబంధించి బహిరంగ వేలం పాటలు జరుగుతాయని కమీషనర్ జి.కృష్ణమోహన్ తెలిపారు.

చేనేతకు ఉచిత విద్యుత్‌పై హర్షం

నరసాపురం టౌన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు చేనేతకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ ప్రకటించడం పట్ల జాతీయ చేనేత ఐక్యవేదిక నరసాపురం అధ్యక్షుడు మావూరి ఆనంద్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ చేనేత రంగానికి మళ్లీ పూర్వవైభవం తెచ్చేందుకు సీఎం నిర్ణయం అభినందనీయమన్నారు.

పెనుమంట్ర: రాష్ట్ర వ్యాప్తంగా చేనేత, మరమగ్గాలకు ఉచిత విద్యుత్‌పై ప్రభుత్వ నిర్ణయం హర్షదాయకమని ఆంధ్రప్రదేశ్ దేవాంగ అభ్యుదయ సేవా సంఘం రాజకీయ విభాగాల రాష్ట్ర అధికార ప్రతినిధి అల్లాడ సూర్య భాస్కరరావు అన్నారు. మార్టేరులో విలేకరులతో మాట్లాడారు.

బంగారం చోరీ కేసులో నిందితుడి అరెస్టు

ఆచంట, మార్చి19 (ఆంధ్రజ్యోతి): ఆచంట మండలం వల్లూరుకు చెందిన వడ్లమన్నాటి వెంకటలక్ష్మిని కొందరు దుండగులు బెదిరించి బంగారు వస్తువులను దొంగిలించారు. ఈ కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేయగా బుధవారం మరొకరిని అరెస్ట్ చేసినట్లు పెనుగొండ సీఐ రాయుడు విజయకుమార్ తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు తెలిపారు. ఈ నెల 2న వడ్లమన్నాటి భాస్కరరావు, వెంకటలక్ష్మి దంపతుల ఇంట్లో ఆరుగురు నిందితులు చొరబడ్డారు. చాకులు చూపించి చంపేస్తామని బెదిరించి బంగారు, వెండి వస్తువులు లాక్కుపోయారన్నారు. ఐదుగురు నిందితులను ఈనెల 14న అరెస్టు చేశామని, రాజమహేంద్రవరానికి చెందిన యడ్ల వెంకటేశ్‌ను అతడి ఇంటి వద్ద అరెస్టు చేశామన్నారు. అపహరించిన బంగారు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారన్నారు. ఎస్ఐ కేవీ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

కట్నం వేధింపులపై ఫిర్యాదు

ఉండి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఉండికి చెందిన చిటికినీడి సత్యలక్ష్మి తిరుపతికి చెందిన వేంపల్లి వినోద్‌కుమార్‌తో పదేళ్ల క్రితం ప్రేమ వివాహమైంది. అదనపు కట్నం తేవాలని తరచూ భర్త, అత్తమామలు వేధిస్తున్నారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఉండి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.